సాక్షి

గుంటూరు

బుధవారం । 31 । జూలై । 2024



పార్వతీ అమ్మవారికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి మంగళవారం భక్తులు సారె సమర్పించారు.



వైభవంగా కుమారస్వామి కల్యాణం

తెనాలిఅర్బన్: కుమారస్వామి జన్మదినం సందర్భంగా గంగానమ్మపేటలోని పాత శివాలయంలో మంగళవారం స్వామివారికి కల్యాణం, విశేష అభిషేకాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు



అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

పారామెడికల్ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సులో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎనస్థీసియా టెక్నీషియన్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్, రెస్పిరేటరీ థెరఫీ టెక్నీషియన్, ఎలక్ట్రో కార్డియోగ్రాఫ్ టెక్నీషియన్, కార్డియాలజి టెక్నీషియన్, ఆప్తాల్మిక్ టెక్నీషియన్, డార్క్ రూమ్ అసిస్టెంట్ కోర్సులు వైద్య కళాశాలలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రెండేళ్ల కాల పరిమితితో అందుబాటులో ఉన్న కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ బైపీసీ, లేదా దానికి సమాన విద్యార్హత ఉన్న వారు అర్హులని వివరించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 6 సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు వైద్య కళాశాల కార్యాలయంలో అందజేయాలని, కౌన్సెలింగ్ ఆగస్టు 19న జరుగుతోందని పేర్కొన్నారు. దరఖాస్తులు ఇతర వివరాల కోసం ఏపీపీఎంబీ.కో.ఇన్, ఏపీఎస్ఏపీఎస్‌హెచ్‌పీసీ.కో.ఇన్ వెబ్‌సైట్లలో చూడాలని పేర్కొన్నారు.

వేణుగోపాలునికి అలంకారం



చేబ్రోలు: ఆషాఢమాసం కామికా ఏకాదశి సందర్భంగా శలపాడులోని వేణుగోపాలుని ఆలయంలో మంగళవారం కృష్ణపరమాత్మ కూరగాయల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

యూజీ పరీక్షల కో-ఆర్డినేటర్‌గా ఆచార్య కృష్ణారావు



ఏఎన్‌యూ :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిగ్రీ (యూజీ) పరీక్షల ఇన్‌చార్జి కో-ఆర్డినేటర్‌గా తెలుగు విభాగ అధ్యాపకులు ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు నియామక ఉత్తర్వులు అందజేశారు. యూనివర్సిటీ అడ్మిషన్ల ఇన్‌చార్జి డైరెక్టర్‌గా యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ బ్రహ్మాజీరావు నియమితులయ్యారు. బ్రహ్మాజీరావుకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు డీఎస్పీ బదిలీ

తాడికొండ: తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ కుమార్ గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది. హెడ్ క్వార్టర్స్‌లో కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

తెనాలి ఆస్పత్రిలో ఉచితంగా డెంగీ పరీక్షలు



తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని, అవసరమైన వారు చేయించుకోవచ్చని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. జిల్లా వైద్యశాలలోని ల్యాబ్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ తెనాలి, గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో డెంగీ నివారణ మందులూ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, ల్యాబ్ ఇన్‌చార్జి సుధీర్, మైక్రో బయాలజిస్ట్ నవీన్, సహాయ మలేరియా అధికారి చరసాని ప్రభాకర్‌రెడ్డి, మలేరియా అధికారులు వంగాల పున్నారెడ్డి, శ్రీకంత ఉమాకాంత్, శివగణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, తిరువీధుల రామప్రసాద్, మున్నంగి రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జనం గుండెల్లో బోగీ మంటలు

- ఇక్కట్ల రైలు ప్రయాణం
- అరకొర బోగీలతో సరి
- జనరల్ ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- కనీస వసతులూ కరువు
- పెరుగుతున్న ఏసీ కోచ్‌లు
- వందేభారత్ రైళ్లపైనే శ్రద్ధ
- కేంద్రం తీరుపై వెల్లువెత్తుతున్న నిరసన

సాక్షి ప్రతినిధి,గుంటూరు, లక్ష్మీపురం, తెనాలి రూరల్: రైళ్లలోని జనరల్ బోగీలు నరకానికి నకళ్లుగా మారాయి. ఫలితంగా ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. వందల కిలోమీటర్ల దూరం నిలువు కాళ్లపై నిలబడే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో మహిళలు, పిల్లలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం తీరుపై మండిపడుతున్నారు. ఏసీ కోచ్‌లు, వందేభారత్ రైళ్లపై ఉన్న శ్రద్ధ సామాన్యులు వెళ్లే జనరల్ బోగీలపైనా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం వివిధ రైళ్లలో జనరల్ బోగీలపై 'సాక్షి' జరిపిన పరిశీలనలో ఈ విషయాలు బయటపడ్డాయి.

రెండే జనరల్ బోగీలు

గుంటూరు స్టేషన్ నుంచి నిత్యం సుమారుగా 20 వేల మందికిపైగా ప్రయాణం చేస్తుంటారు. గుంటూరు రైల్వే స్టేషన్‌కు నిత్యం సుమారుగా 65 రైళ్లు వస్తుంటాయి. వీటిలో ప్రధానంగా సికింద్రాబాద్, వైజాగ్, తిరుపతి, గుంతకల్లు, పిడుగురాళ్ల, విజయవాడ, రాజమండ్రి, వైపుగా ప్రయాణించే రైళ్లు ఉన్నాయి. ఈ స్టేషన్ మీదుగా ప్రయాణించే వాటిలో సికింద్రాబాద్-తిరువనంతపురం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్, హౌరా – సికింద్రాబాద్ నడిచే ఫలక్‌నుమా, సికింద్రాబాద్ – భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్, వాస్కో-షాలీమార్ మధ్య నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ – బెంగుళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కి రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉన్నాయి. వీటిల్లో ప్రయాణికులు కనీసం నిలబడేందుకూ స్థలం లేక నరకయాతన అనుభవించారు. బోగీలో కనీసం తాగునీటి వసతి లేదు. మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దుర్గంధం వెదజల్లుతున్నాయి. వాటివద్దే ప్రయాణికులు కూర్చుని, నిలబడి ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది.



శబరి ఎక్స్‌ప్రెస్‌లోని జనరల్ బోగీలో కిక్కిరిసిన ప్రయాణికులు



ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఫుట్‌బోర్డు మీద కూర్చుని ప్రయాణిస్తున్న దృశ్యం

ప్యాసింజర్ రైళ్లు తగ్గింపు

ఒకప్పుడు పేదల బండిగా ఉన్న రైలు ఇప్పుడు పేద వారికి అందని ద్రాక్షగా మారుతోంది. కేంద్రప్రభుత్వం ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్, వందేభారత్ వచ్చాక ప్యాసింజర్ రైళ్లను తగ్గించి వేయడమే కాకుండా ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను కాలక్రమేణా కుదిస్తూ వస్తోంది. రైళ్లలో ప్రయాణికుల సౌకర్యాలు పెంచుతున్నామనే పేరుతో రైలు ప్రయాణాన్ని పేదలకు దూరం చేస్తోంది.

హైదరాబాద్ నుంచి నిలువుకాళ్లపైనే



సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్ 20 నిముషాలు ఆలస్యంగా సాయంత్రం 5.20 గంటలకు గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ రైలులో జనరల్ బోగీలు రెండే ఉన్నాయి. అవీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. మహాలక్ష్మి అనే ప్రయాణికురాలు తన బిడ్డలతో కలిసి హైదరాబాద్ నుంచి గుంటూరు వరకూ నిలువు కాళ్లపై నిల్చొనే ప్రయాణం చేస్తూ వచ్చింది.

టాయిలెట్లూ అస్తవ్యస్తం



అద్దం లేని టాయిలెట్ కిటికీ

ధన్‌బాద్ నుంచి అలెప్పీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ మంగళవారం మూడు గంటలు ఆలస్యంగా రాత్రి 7.50 గంటలకు తెనాలి రైల్వే స్టేషన్‌కు వచ్చింది. 24 బోగీలు ఉన్న ఈ రైలులో మూడు మాత్రమే జనరల్ బోగీలు. ఫలితంగా వీటిల్లో జనం కిక్కిరిసిపోయారు. వీటిలో 80 మంది చొప్పున ప్రయాణించేందుకే అవకాశం ఉంటుంది. కానీ సుమారు 140 మంది వరకు ఉన్నారు. రెండు జనరల్ బోగీల బాత్‌రూమ్‌లకు కిటికీ అద్దాలు లేవు. అందులోకి వెళ్లిన వ్యక్తి బయటకు కనపడేలా ఉన్నాయి. తలుపు దగ్గర, నడిచే దారిలో, ఆఖరికి టాయిలెట్ల వద్ద కూడా ప్రయాణికులు కూర్చుని ప్రయాణించారు.



కిటకిట



నేను తిరుపతి వెళ్తున్నా. నేను ఎక్కిన రైలులో రెండు మాత్రమే జనరల్ బోగీలు. కిటకిటలాడుతున్నాయి. ఏ స్టేషన్‌లో అయినా తగ్గుతారని అనుకుంటే రైలు ఆగిన ప్రతి స్టేషన్‌లో జనం ఎక్కుతూనే ఉన్నారు. జనరల్ బోగీలను పెంచాలి.

– గాజులు రామాంజనేయులు, బయ్యవరం

బోగీలు తగ్గిస్తే ఎలా



కేంద్రం సామాన్య ప్రజలకు రైలు ప్రయాణం దూరం చేసేలా ఉంది. జనరల్ బోగీలు ఉండట్లేదు. స్లీపర్ కోచ్‌లు, ఏసీ కోచ్‌ల ధరలు అందని ద్రాక్షలా ఉన్నాయి. నాలాంటి పేదల కోసం జనరల్ బోగీలు పెంచాల్సింది పోయి తగ్గిస్తే ఎలా?

– కుర్రా హనుమంతరావు, క్రోసూరు, పల్నాడు జిల్లా

ఉగ్గబట్టుకున్నాం



మాది తెనాలి. నేను శబరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఎక్కాను. ఎప్పుడు తెనాలి చేరుకుంటానా అని ఉగ్గబట్టుకుని కూర్చున్నా. భరించలేని దుర్వాసన, నిలబడేందుకూ స్థలం లేదు. ఫుట్ బోర్డుపై కూర్చుని ప్రయాణించాను.

– కూరపాటి సుదీప్, తెనాలి



ఫుట్‌బోర్డుపై కూర్చున్న మహిళా ప్రయాణికులు





శబరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీల్లో ప్రయాణికుల రద్దీ



కిటకిటలాడుతున్న శబరి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఎక్కుతున్న ప్రయాణికులు

టీడీపీ నేతలకు శాండ్‌విచ్!

- స్టాక్ పాయింట్లలో తెలుగుతమ్ముళ్ల దందా
- దొడ్డిదారిన ఇసుక సరఫరా
- డబ్బులిస్తేనే ముందు టోకెన్
- లేకపోతే వెయిటింగే
- బిల్డర్ల నుంచి ఫోన్ పేలు
- వారి లారీలకే పెద్దపీట
- చోద్యం చూస్తున్న జిల్లా యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఇసుక స్టాక్ పాయింట్లు టీడీపీ నేతలకు శాండ్‌విచ్‌ల్లా మారాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న స్టాక్ పాయింట్లను వారు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తాము చెప్పిన వారికే ముందు ఇసుక సరఫరా జరగాలని హుకుం జారీ చేస్తున్నారు. బిల్డర్లతో ముందుగానే ఒప్పందాలు చేసుకుంటుని వారి నుంచి డబ్బులు తీసుకుని ఇసుక టోకెన్లు ఇస్తున్నారు. దీంతో ఎటువంటి సిఫార్సు లేకుండా ఇసుక కోసం వెళ్లిన వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. నిర్మాణాలు చేసుకునే ఇళ్ల యజమానులు ఇబ్బందులుపడుతున్నారు. ఒక లారీ కోసం మరుసటి రోజు వరకూ కూడా అక్కడే కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొంది. వాహనం వెయిటింగ్ చార్జీ కూడా వినియోగదారునికి భారంగా మారుతోంది.

మున్నంగి పాయింట్ ఒక్కటే!

బాపట్ల జిల్లా పరిధిలోని స్టాక్ పాయింట్లలో ఇసుక అయిపోవడంతో అక్కడి ప్రజలూ గుంటూరు జిల్లాలోని స్టాక్ పాయింట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. కొల్లిపర మండలంలో కొల్లిపర స్టాక్ పాయింట్ ఖాళీ అవ్వడంతో మున్నంగి స్టాక్ పాయింట్ ఒక్కటే నడుస్తోంది. దీంతో వాహనాలు పెద్దఎత్తున క్యూ కడుతున్నాయి. వినియోగదారుల డిమాండ్‌ను అదునుగా చేసుకుని తెలుగుదేశం నాయకులు దందాకు తెరలేపారు. బల్క్‌గా ఇసుక అవసరమయ్యే బిల్డర్లతో ఒప్పందాలు చేసుకుని లారీకి రూ.1,000 నుంచి రూ.1,500 వరకూ డబ్బులు తమ ఫోన్‌పే ద్వారా తీసుకుంటున్నారు. బిల్డర్ల లారీలను ముందు వరుసలో పెట్టడమే కాకుండా వారికి ఎక్కువ లోడింగ్ చేస్తున్నారు. ఈ రోజు ఇసుక తీసుకువెళ్లి అదే టోకెన్‌పై లారీ నంబర్లు మార్చి మరుసటి రోజూ ఇసుక తీసుకువెళ్తున్నారు. దీనిని గమనించి విలేకరులు నిలదీయడంతో లారీ డ్రైవర్ నుంచి ఆ టోకెన్ తీసుకుని పంపించి వేశారు. ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నా.. జిల్లా యంత్రాంగం చోద్యం చూస్తూ ఉండటం విమర్శలకు దారితీస్తోంది.



మున్నంగి స్టాక్ పాయింట్‌లో ఇసుక లోడింగ్

ఆ పాయింట్లలో సామాన్యులకు వెతలే!

తుళ్లూరు మండలం లింగాయపాలెం స్టాక్ పాయింట్లో సామాన్యులకు ఇసుక అందనీయడం లేదు. స్థానికుల పేరుతో తెలుగుదేశం పార్టీ నాయకులు హడావుడి చేస్తున్నారు. దొడ్డిదారిలో టోకెన్లు పొంది తమ అనుకూల వాహనాలకు ముందే ఇసుక లోడింగ్ చేయించుకుంటున్నారు. లింగాయపాలెం స్టాక్ పాయింట్లో టీడీపీ నాయకుడు అనుమోలు సత్యనారాయణ పేరుతో కొన్ని లారీలు అనధికారికంగా రోజుకు నాలుగు ట్రిప్పులు ఇసుక తరలిస్తున్నాయి. దీంతో లారీ డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. స్థానికత పేరుతో టీడీపీ నాయకులు ఈ దందా సాగిస్తున్నట్టు తెలుస్తోంది. లారీలు రోజుకు ఒక ట్రిప్పు మాత్రమే ఇసుకను తీసుకెళుతున్న కారణంగా వెయిటింగ్ చార్జి డ్రైవర్ల జీతం తమకు గిట్టుబాటు కావడం లేదంటూ లారీ ఓనర్లు ఆందోళన చెందుతున్నారు. తాళ్లాయపాలెం స్టాక్ పాయింట్‌ను వర్షాల వల్ల రోడ్డు సరిగా లేని కారణంగా రెండురోజుల క్రితం వరకూ మూసి ఉంచారు. దీంతో వాహనదారులు ఇసుక అందక ఇబ్బందులు పడ్డారు. రెండు రోజుల నుంచి ఇక్కడ లోడింగ్ జరుగుతున్నా సీడ్ యాక్సెస్ రోడ్డుపై వాహనాలను క్యూలో ఉంచి స్టాక్ పాయింట్ వద్దకు పది వాహనాలను మాత్రమే పంపిస్తున్నారు. లారీలు వెళ్లి వచ్చేందుకు రోడ్డు సక్రమంగా లేకపోవడం వల్ల స్టాక్ పాయింట్ వద్ద లోడింగ్ ప్రక్రియకు విఘాతం కలుగుతోంది.



ఇసుక ఏ లారీకి పోయాలో నిర్దేశిస్తున్న తెలుగుదేశం నాయకుడు

అడ్డగోలుగా రాత్రీపగలూ తరలింపు

మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, రామచంద్రాపురం, గొడవర్రులతోపాటు కృష్ణానది కరకట్ట లోపలకు కొత్తగా ఏర్పాటు చేసిన ర్యాంపుల నుంచి రాత్రి పగలూ తేడా లేకుండా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టి లోపల వేయిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. కృష్ణానది తీరంలో ఉన్న గ్రామస్థాయి నాయకులు ఈ దందాకు పాల్పడుతున్నారు. దోపిడీ విధానంలో కూడా టీడీపీ కార్యకర్త అయితేనే ఇసుక క్వారీలోకి స్థానిక నాయకులు అనుమతిస్తున్నారు. ఎవరైనా ఇతర పార్టీ వారు కానీ, సామాన్య ట్రాక్టర్ యజమానులు గానీ ఇసుక లోడింగ్‌కు వెళితే ఆ ట్రాక్టర్లను ఎస్ఈబీ వారికి పట్టించి కేసు నమోదు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే ఆ ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు రాకుండా రోజుల తరబడి సీజ్ చేయడంతో మిగతా వారు క్వారీ వంక చూసేందుకు భయపడుతున్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి
- లక్ష్యసాధన దిశగా కృషిచేసి ఉన్నత స్థానాలను పొందాలి
- ఎమ్మెల్యే బి రామాంజనేయులు
- లయోలాలో ఆంధ్రా తెలంగాణ రీజినల్ బాలికలబాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం



బాస్కెట్‌బాల్ ఆడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ కూడా విద్యార్థి దశనుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలలో పాల్గొనడం వల్ల విద్యార్థులు ఆలోచనాశక్తి, సామర్థ్యాలు పెంచుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం రూరల్ మండలం నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో ఆంధ్రా, తెలంగాణ రీజియన్ ఐసీఎస్ఈ, ఐఎస్ఈ పాఠశాలల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలను జిల్లా కలెక్టర్ ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి రామాంజనేయులుతో కలసి ప్రారంభించారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించి, బెలూన్స్, పావురాలను ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. విద్యార్థిని బృందం చేసిన స్వాగత నృత్యం అందరినీ ఆకర్షించింది. కలెక్టర్ మాట్లాడుతూ తనకు బాస్కెట్‌బాల్ క్రీడ అంటే అమితమైన ఇష్టమని ఎన్‌బీఏ ద్వారా నిర్వహించే ప్రపంచ స్థాయి క్రీడా పోటీలు వేకువజాముల్లో టీవీలలో ప్రసారం అయ్యేవని వాటిని ఇష్టంగా తిలకించడం జరిగేదన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు బాస్కెట్‌బాల్ లాంటి క్రీడను ఎంపిక చేసుకోవటం ఆనందకరమన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోడానికి ఇదొక మంచి అవకాశమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పి ఆంతోని మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే పోటీల్లో మొత్తం 45 జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. క్రీడాకారులు క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తితో ఆడి క్రీడలు విజయవంతం చేయాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, ఉపాధ్యాయేతర సిబ్బంది ఈ పోటీల విజయవంతానికి ఎంతో శ్రమిస్తున్నారన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యేలు క్రీడాకారిణిలతో కరచాలనం చేశారు. అనంతరం అతిథులకు మెమెంటోలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు నగర స్టెమ్ స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ భరత్‌రెడ్డి లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ యస్ సవేరి, హోలి ఫ్యామిలీ స్కూల్ (సత్తెనపల్లి) ప్రిన్సిపాల్ సిస్టర్ ఎం .విజయరాణి, వైస్ ప్రిన్సిపల్ రెవరెండ్ పాదర్ నరేష్, పీఈటీలు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యార్డుకు 47,204 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 47,204 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,472 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.16,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,500 నుంచి రూ.16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ.18,400 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. ఇంకా 17,480 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సరైన చర్య

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి సంఖ్యా బలం నిబంధన లేనప్పుడు శాసనసభలో వైఎస్సార్ సీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సరైన చర్య అని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ స్పీకర్‌కు రాసిన లేఖపై సకాలంలో సరైన చర్య తీసుకోకపోవడం చట్టసభల విలువను దిగజార్చడమేనని అభిప్రాయపడ్డారు. పంతాలు, పట్టింపులకు కక్షలు కార్పణ్యాలకు తావివ్వడానికి స్పీకర్ స్థానం ఆలంబన కాకూడదని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం అంకిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన శ్యామల రాజగోపాల్‌రెడ్డి(50) మధ్యాహ్నం సమయంలో తమ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతూ ఉండగా చిలకలూరిపేట నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న మహిళ పొత్తూరు వద్ద హైవే అండర్‌పాస్ వద్ద ఢీకొంది. ప్రమాదంలో రాజగోపాల్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య శ్యామల లక్ష్మీకాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలు, అప్పులతో రైతు ఆత్మహత్య



క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామానికి చెందిన గొర్రెపాటి దానయ్య(65) సోమవారం కుటుంబ కలహాలు, వ్యవసాయంలో చేసిన అప్పుల నేపథ్యంలో ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.షఫీ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ ఫిర్యాదులో తన తండ్రి కుటుంబ కలహాలు, వ్యవసాయంలో వచ్చిన నష్టాలతో అప్పులు అధికమవ్వటంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడన్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కలదు. మంగళవారం పోస్టుమార్టం పూర్తిచేయించి, మృతదేహాన్ని కుటుంబీకులకు అందచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాగునీటి కాలువల పరిశీలన



తాడేపల్లిలోని కొండవీటివాగును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కొండవీటి వాగు ప్రాంతాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. కృష్ణా పశ్చిమ డెల్టా విభాగం హెడ్ రెగ్యులరేటర్‌ను పరిశీలించిన అనంతరం కాలువ ప్రవాహ సామర్థ్యం, నీటి లభ్యత గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం, కొండవీటి వాగు పంప్ హౌస్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కాలువ నుంచి తొలగిస్తున్న గుర్రపుడెక్కను పరిశీలించారు. కృష్ణా పశ్చిమ డెల్టా ప్రవాహ ప్రాంత్రమైన దుగ్గిరాల లాకులను సందర్శించి అక్కడ ఉన్న కొమ్మమూరు కాలువను, ఈస్ట్ కెనాల్, వెస్ట్ కెనాల్, బ్యాంక్ కెనాల్ కాలువ నీటి ప్రవాహ సామర్థ్యాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ ఇరిగేషన్ కాలువల్లో నీటి ప్రవాహం, గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించామని, వ్యవసాయ పనులు ప్రారంభమైనందున పంటలు పండించేందుకు అవసరమైన నీటిని కాలువల ద్వారా విడుదల చేస్తున్నామని, ఇప్పటి వరకు రూ.5.7 కోట్లతో 76 పనుల చేపట్టేందుకు ఆదేశాలు జారీచేశామని, 20 నుంచి 30 రోజులలోపు 70 శాతం వరకు పనులు పూర్తి చేశామని చెప్పారు. కోటి రూపాయల నిధులతో పెదవడ్లపూడి వద్ద ఉన్న హైలెవల్ కెనాల్ పనులు పూర్తి అయితే మంగళగిరి, తెనాలి, పొన్నూరు నియోజకవర్గ ప్రాంతాల నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తామని ఆమె చెప్పారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ వి.ఉమామహేశ్వరరావు, కార్యనిర్వహణ ఇంజినీర్ ఎస్.కె.వి.ప్రసాదరావు, ఇరిగేషన్ డివిజన్, గుంటూరు కృష్ణా పశ్చిమ డెల్టా కార్య నిర్వహణ ఇంజనీర్ ఎస్.మల్లికార్జున్, డ్రెయినేజ్ కార్య నిర్వహణ ఇంజనీర్ పి.వెంకటరత్నం, ఉప కార్యనిర్వహణ ఇంజినీర్లు సి.హెచ్. శివశంకర్, అనిల్, వి.కృష్ణ, తాడేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ సతీష్, దుగ్గిరాల ఎంపీడీఓ భవాని, సహాయక సహాయక ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్లో కళావేదిక ప్రారంభోత్సవం

- వేదికను రూ.10 లక్షలతో నిర్మించిన దాతలు బండి అశోక్‌రెడ్డి, సుధావాణి దంపతులు
- బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడిన వక్తలు



బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బండి అశోక్‌రెడ్డి సుధావాణి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

పెదకాకాని: విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చెప్పారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నిర్మించిన కళావేదికకు ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు అధ్యక్షత వహించారు. పాఠశాల ఆవరణలోని సరస్వతి అమ్మ వారికి పూజలు చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా బండి సాహితీ కళావేదికను ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలో గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది ఉత్తీర్ణతాశాతం పెరగడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముందుకు వచ్చిన దాతలను స్వాగతిస్తామన్నారు. తమ కుమార్తె పేరున రూ.10 లక్షలు వెచ్చించి పాఠశాలలో కళావేదిక నిర్మించిన బండి అశోక్‌రెడ్డి, సుధావాణి దంపతులను కొనియాడారు. అనంతరం బండి అశోక్‌రెడ్డి, సుధావాణి దంపతులను ఘనంగా సత్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మాట్లాడుతూ సాహితీరెడ్డి భౌతికంగా లేకపోయినా ట్రస్టు పేరుతో సేవలందిస్తున్న తల్లిదండ్రులు బండి అశోక్‌రెడ్డి సుధావాణిలను ప్రత్యేకంగా అభినందించారు. బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్టు సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి పేర్కొన్నారు. బండి సాహితీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గతంలో ఇదే పాఠశాలలో రూ.50 లక్షలతో 5 తరగతి గదులు నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల శ్రావణి, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె.నాగలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, బుల్లా ఆశీర్వాదం, ప్రముఖ రంగస్థల నటుడు నాయుడు గోపి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, ఎంఈఓలు డి.బలిరాం, శంకర్‌రాజు, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పులగం రామిరెడ్డి పాల్గొన్నారు.



కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, అశోక్‌రెడ్డి, సుధావాణి

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.3800, గరిష్ఠ ధర రూ.5000, మోడల్ ధర రూ.4500 వరకు పలికింది.

దేవుడి ఆదాయానికి శఠగోపం

- నిబంధనలకు తిలోదకాలు
- రాజకీయ ఒత్తిళ్లతో రహస్యంగా వేలంపాట ఖరారు
- అధిక ధర చెల్లిస్తామన్నా వినని అధికారులు
- తమపై ఒత్తిళ్లు ఉన్నాయని అర్థం చేసుకోవాలని వేడుకోలు

పెదకాకాని: రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో గుంటూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ భూముల బహిరంగ వేలంలో అధికారులు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. ఫలితంగా దేవుని ఆదాయానికి గండిపడుతోంది. పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అమ్మిశెట్టి మల్లికార్జునరావు ఏటా సాగు చేస్తున్న పెదకాకాని శివాలయం, పాత గుంటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయం భూములు కౌలు సాగు ఆయనకు దక్కకుండా కొందరు అడ్డుకున్నారు. పాత గుంటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి దాతలు ఉప్పలపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 589–1లోని 6.70 ఎకరాలు మాగాణి భూమిని స్వాధీనం చేశారు. 25 ఏళ్లుగా వెంకటకృష్ణాపురానికి చెందిన అమ్మిశెట్టి మల్లికార్జునరావు బహిరంగ వేలంలో హెచ్చుపాటకు భూమిని పాడుకుని కౌలుకు సాగు చేసుకుంటున్నారు. ఈ భూమికి సంబంధించిన వేలంపాటను ఉప్పలపాడు శివాలయంలో దేవాదాయ అధికారులు ప్రతి మూడేళ్లకోసారి నిర్వహిస్తారు. 2021లో భూమిని ఏడాదికి రూ.1,32,000కు పాడుకున్నారు. 2024–2027 మధ్య కాలానికి గత నెల 28న ఉప్పలపాడు శివాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఏడాదికి రూ.2,50,000 చెల్లించేలా అమ్మిశెట్టి మల్లికార్జునరావు హెచ్చు పాటదారునిగా ఉన్నారు. ఇదే సమయంలో పలువురు రైతులు రూ.2,01000కు కొట్టి వేయాలని దేవదాయ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. వివాదం రేగడంతో అధికారులు పాటను వాయిదా వేశారు.

మళ్లీ వాయిదా

తిరిగి ఈ నెల 15వ తేదీన పాత గుంటూరు(శివాలయం) అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పాట నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రహస్యంగా పాట నిర్వహిస్తుండగా తెలుసుకుని పలువురు రైతులు అక్కడికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న వైఎస్సార్ సీపీకి చెందిన రైతులకు పాట ఇవ్వడానికి ఇష్టం లేని అధికారులు వేలంను మళ్లీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రూ.1,62,000కు ఖరారు

పాట వాయిదా తేదీని బహిరంగంగా ప్రకటించకుండానే, దండోరా వేయించకుండానే పంచాయతీలో ముద్ర వేయించి మంగళవారం రహస్యంగా వేలంపాట నిర్వహించారు. ఒక వర్గం వారితోనే నిర్వహించిన వేలంపాటను సంవత్సరానికి రూ.1,62,000కు ఖరారు చేశారు. దీనిపై అమ్మిశెట్టి మల్లికార్జునరావు నిలదీయగా, తమపై ఒత్తిళ్లు ఉన్నాయని అసభ్యంగా మాట్లాడుతున్నారని, అర్థం చేసుకోవాలని అధికారులు వేడుకోవడం గమనార్హం. ఏడాదికి అదే భూమికి రూ.3,50,000 చెల్లిస్తానని మల్లికార్జునరావు ప్రకటించినా వినలేదు. దీనిపై ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా కౌలు భూమికి బహిరంగ వేలంపాటలు దేవదాయశాఖ నిబంధనల ప్రకారమే నిర్వహించామని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కమాండ్ కంట్రోల్ రూం తనిఖీ



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిబ్బందితో హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశాలతో ప్రారంభమైన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి పారిశుద్ధ్యంపై వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, ఎంపీడీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని సిబ్బందికి సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఆగస్టు 10 వరకు పని చేస్తుందని తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసిన రిజిస్టర్లను జెడ్పీ చైర్‌పర్సన్ పరిశీలించారు.

టీడీపీ నేతల మట్టి అక్రమ తవ్వకాలు



నల్లచెరువులో మట్టిని తవ్విన ప్రదేశాలు



అక్రమంగా మట్టిని తవ్వే జేసీబీ

రాత్రిళ్లు పదుల సంఖ్య లారీలతో తరలింపు

గుంటూరు రూరల్: టీడీపీ నేతలు మట్టి అక్రమ తవ్వకాలు శ్రుతిమించాయి. రాత్రికిరాత్రే పదుల సంఖ్యలో లారీలతో మట్టిని తవ్వి విక్రయాలు చేపట్టి లక్షల రూపాయల ప్రభుత్వ ధనాన్ని కొల్లగొడుతున్నారు. గోరంట్ల శివారులో వెనిగండ్ల సమీపంలోని నల్లచెరువులో స్థానిక టీడీపీ నేతలు మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. రాత్రికిరాత్రే పదుల సంఖ్యలో లారీల్లో తరలిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. మట్టి లారీలు రాత్రివేళల్లో మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనివల్ల రోడ్లూ ఛిద్రమవుతున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మట్టి విక్రయాలకు అధికారులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

గుంటూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి లీలావతి



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి

పెదకాకాని : మానవ అక్రమ రవాణాను అరికట్టాలని గుంటూరు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి చెప్పారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో 'మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని' పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి గుంటూరు జిల్లా సివిల్ జడ్జి లీలావతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత అధ్యక్షత వహించారు. జడ్జి లీలావతి మాట్లాడుతూ కొందరు చెప్పే స్వార్థపూరిత మాటలు నమ్మి దురవాలవాట్లకు బానిసలై విద్యార్థులు, పిల్లలు మోసపోతున్నారని పేర్కొన్నారు. మోసగాళ్లను నమ్మి ఇళ్ల వదిలి అక్రమ రవాణాకు గురవుతున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, డీఎల్ఎస్ఏ టి.లీలావతి, సిడబ్ల్యూసీ చైర్ పర్సన్ జి.ప్రమీల, లత, రూబీ, కె.అనూషా, జె.ఇజ్రాయేల్, ఎస్. నాగలక్ష్మి, బి.విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'స్టార్టప్ కాంపిటిషన్'



నంబూరు వీవీఐటీలో జరిగిన స్టార్టప్ కాంపిటిషన్‌లో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల చైర్మన్ వాసిరెడ్డి

పెదకాకాని: విద్యార్థులలో దాగి ఉన్న నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా స్టార్టప్‌ల (అంకుర సంస్థల) ఏర్పాటుకు మార్గదర్శకం చేయడానికి వీవీఐటీ కళాశాలలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐ.ఐ.సి) ఆధ్వర్యంలో స్టార్టప్ కాంపిటిషన్' నిర్వహించినట్లు చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఈ పోటీలలో విద్యార్థులు 20 బృందాలుగా ఏర్పడి ఆలోచనలు, మార్కెటింగ్ అవకాశాలు, పరస్పర ప్రయోజనాలు, పెట్టుబడులు ఇతర అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులను వివరణాత్మకంగా ప్రదర్శించారు. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ పిల్లలు దూరంగా ఉండే తల్లిదండ్రులు వైద్యసహాయం కోసం ' పికప్ హాస్పిటల్ డ్రాప్ (పి.హెచ్.డి)' పేరుతో రూపొందించిన బోధి ధర్మా టీమ్ ప్రదర్శన ఆలోచింపజేసిందని పేర్కొన్నారు. నిషేధిత వస్తువుల వివరాలను తెలియజేస్తూ విద్యార్థులు రూపొందించిన 'ప్రొడక్ట్ ఎవేర్నెస్' యాప్ ఆకట్టుకుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల మధ్య బోధన, బోధనేతర వనరుల సమీకరణ అందించేలా రూపొందించిన ప్రదర్శన మొదటి బహుమతి గెలుచుకున్నట్టు వివరించారు. అనంతరం ఈ పోటీలలో పాల్గొని తమ ఆలోచనలను ప్రదర్శించిన విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి అభినందించారు.

కౌలు రైతు మృతదేహానికి పోస్టుమార్టం

ఖననం చేసిన రెండురోజుల తర్వాత బయటకు తీసి శవ పంచనామా



కౌలురైతు మృతదేహానికి పోస్టుమార్టం చేస్తున్న వైద్యులు

ప్రత్తిపాడు: అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన కౌలు రైతు మృతదేహాన్ని ఖననం చేసిన రెండు రోజుల తరువాత బయటకు తీసి అధికారులు శవపంచనామా, పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంకు చెందిన ధూపాటి శివయ్య ఈ నెల 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అతని బంధువులు 28న అదే గ్రామంలో ఖననం చేశారు. ఖననం చేసిన తరువాత అతని భార్య ముత్తమ్మ తన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన తరువాత కచ్చితంగా పోస్టుమార్టం చేయాల్సి ఉండటంతో మంగళవారం సాయంత్రం శివయ్య మృతదేహాన్ని పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో బయటకు తీశారు. తొలుత రెవెన్యూ అధికారులు శవ పంచనామా నిర్వహించారు. అనంతరం ఫోరెన్సిక్ గుంటూరు మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జాఫర్ హుస్సేన్ పోస్టుమార్టం చేశారు. తహశీల్దార్ కె.రవిబాబు, ఇన్‌చార్జి ఎస్ఐ రవీంద్రలు మృతుని భార్యను విచారణ చేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన చర్యలు

గురజాల డీఎస్పీ సిహెచ్ శ్రీనివాసరావు

మాచర్ల రూరల్: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వాధికారులపై దాడులకు పాల్పడితే వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని గురజాల డీఎస్పీ సిహెచ్ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మాచర్ల రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్దుర్తి మండలంలోని హనుమాపురంతండా ప్రాంతంలో అలుగు స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఫారెస్టు అధికారిపై దాడికి పాల్పడిన సంఘటనపై ఆయన స్పందించారు. వెల్దుర్తి మండలం అటవీ ప్రాంతంలో కొంతకాలంగా కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి వన్యప్రాణులను స్మగ్లింగ్ చేస్తున్నారని, ఈ క్రమంలోనే హనుమాపురంతండాకు చెందిన దేశావత్ గోవింద్‌నాయక్, అటవీ ప్రాంతంలోని వన్యప్రాణి అయిన అలుగును అమ్మేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వీపీ సౌత్ ఫారెస్టు రేంజ్ అధికారి సత్యనారాయణరెడ్డి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న గోవింద్ నాయక్‌ను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా ఆ వాహనం పై పలువురు వ్యక్తులు ఒక్కసారిగా రాళ్లదాడికి పాల్పడి సత్యనారాయణరెడ్డిని తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ సంఘటన పై పోలీసులు వెంటనే స్పందించి ఐదుగురిని అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. పరారీలో ఉన్నవారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వాధికారులపై దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, ఈ విషయంలో ఎవరు తమపై ఎవరు ఒత్తిడి చేసినా వదిలే ప్రసక్తి ఉండదన్నారు. శాంతిభద్రతలు కాపాడటంలో ఉన్నతాధికారులు తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, ప్రజలకు రక్షణ కల్పించటంలో పోలీసు శాఖ నిస్వార్థంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.